పంచనారసింహులకు భక్తుల మొక్కు పూజలు


నిత్య కల్యాణంలో భక్త దంపతులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: పంచనారసింహులు కొలువై ఉన్న యాదాద్రి పుణ్యక్షేత్రంలో శనివారం భక్తజనుల ఆరాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున సుప్రభాతం నిర్వహించిన పూజారులు బిందెతీర్థంతో చేపట్టిన కైంకర్యాలు ఆలయ విశిష్టతకు అనుగుణంగా కొనసాగాయి. గర్భాలయంలో కొలువై ఉన్న స్వయంభువులను మేల్కొల్పిన పూజారులు హారతితో కొలిచారు. అర్చామూర్తులను పంచామృతంతో అభిషేకించి తులసీ దళాలతో అర్చన చేపట్టారు. కవచమూర్తులకు సువర్ణ పుష్పార్చన జరిపారు. ఆలయ మహాముఖ మండపంలో అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన పర్వాలను కొనసాగించారు. అష్టభుజి మండప ప్రాకారంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం ఆలయ ఆచార వ్యవహారాలతో నిర్వహించారు. వర్షం కురవడంతో అలంకార జోడు సేవలను మంగళ వాయిద్యాల మధ్య ఆలయంలోనే ఊరేగించారు. భక్తులు క్షేత్రాన్ని సందర్శించి హరిహరులను దర్శించుకున్నారు. క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామిని కొలుస్తూ, సహస్రనామార్చ నిర్వహించారు.

బియ్యంలో రారాజు నల్గొండ




హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: కృష్ణా నీటి ఆధారంగా ఉమ్మడి జిల్లాలో ఎక్కువ సాగు అవుతుంది. అలా పండిన ధాన్యం మంచిదని, నాణ్యమైందని గతంలో నిర్వహించిన పరీక్షల్లోనూ తేలింది. రెండు రకాలుగా పరీక్షలు నిర్వహించి నాణ్యతను నిర్ధారించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కృష్ణా జలాలతో వరి పండుతున్నా.. నల్గొండ జిల్లాలో పండిన ధాన్యం నాణ్యమైందని నిరూపణ కాగా, రుచికరమైందని కూడా అంటుంటారు. అందుకే నాణ్యమైన, రుచికరమైన బియ్యానికి నల్గొండ రారాజు అన్న పేరుంది. అన్నం రుచిని గుర్తించిన వారు ఏ ప్రాంతంలో ఉన్నా నల్గొండ ప్యాకింగ్ బియ్యం కొనుగోలు చేసేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతారు. నాణ్యత, రుచి ఉండటం వల్ల ఏ జిల్లా బియ్యం కూడా ఇక్కడి బియ్యంతో పోటీ పడలేవని వ్యాపారులు చెబుతున్నారు.

జిల్లా నుంచి భారీ ఎగుమతులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి షరతులు లేకుంటే ఒక్క జిల్లా నుంచే దాదాపు 1.5 లక్షల నుంచి 2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతులు జరుగుతుంటాయి. ఇందులో సింహభాగం బాయిల్డ్ బియ్యమే అయినా పచ్చి బియ్యం కూడా ఎగుమతి జరుగుతుంది. దేశంలో ఎక్కువగా ఎగుమతులు జరుగుతుండటంతో బియ్యం ధరలు పెరిగే అవకాశం ఉందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఎగుమతి సుంకాలను భారీగా పెంచింది. దేశంలోని ఇతర రాష్ట్రాలకు మాత్రం భారీగానే ఎగుమతి జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎప్పటికప్పుడు ధరలను సమీక్షించుకుంటూ ఎగుమతులకు అనుమతులు ఇస్తుంది. ఉమ్మడి జిల్లాలో 300 మిల్లులు ఉండగా అందులో పచ్చిబియ్యం మిల్లులు 120, మిగతా బాయిల్డ్ మిల్లులు ఉన్నాయి.

★ జిల్లా నుంచి సింగపూర్, మలేషియా, దుబాయ్‌తో పాటు అన్ని అరబ్ దేశాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. వీటితో పాటు ఆఫ్రికా దేశాలకు పచ్చి బియ్యం, బాయిల్డ్ బియ్యం సరఫరా అవుతాయి. గతంలో పాకిస్థాన్‌కు కూడా జిల్లా నుంచి ఎగుమతులు జరిగాయి. ఇతర దేశాలకు ఎగుమతి దారులు వారు కోరిన ప్యాకింగ్‌లలో ఇస్తారు.



దేశంలో ఇలా...

మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు బియ్యం ఎగుమతులు జిల్లా నుంచి జరుగుతాయి. మహారాష్ట్రలో జైశ్రీరామ్ (చింట్లు) రకం పచ్చి బియ్యానికి మంచి డిమాండ్ ఉండటంతో ఎక్కువగా ఎగుమతి జరుగుతున్నాయి. మన దగ్గర ఎక్కువగా వాడే బీపీటీ కంటే సన్నగా జైశ్రీరాం ఉన్నా మన రాష్ట్రంలో వీటి వాడకం తక్కువని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అందువల్ల ఇతర రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఒక సీజన్‌లో సాగు (ఎకరాల్లో), దిగుబడి (మెట్రిక్ టన్నులలో) అంచనా వివరాలు

జిల్లా	సన్నరకాల సాగు	దిగుబడి	దొడ్డు రకాల సాగు	దిగుబడి
నల్గొండ	2,42,490	5,81,975	1,90,527	4,57,265
సూర్యాపేట	3,41,650	8,19,960	1,09,042	3,05,318
యాదాద్రి	97,028	1,74,650	52,245	1,04,490

ప్రజలు, వైద్యులకు వారధి..‘ఆశ’లు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రజలకు వైద్యులకు సామాజిక ఆరోగ్య కార్యకర్త (ఆశ)లు వారధిలా పని చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఎల్.యశోద సూచించారు. తంగడపల్లిలోని పీహెచ్‌సీలో ‘ఆశ’ దినచర్యల నమోదు పుస్తకాలను శనివారం ఆవిష్కరించి, పంపిణీ చేసి మాట్లాడారు. సామాజిక ఆరోగ్య కార్యకర్తలు విధి నిర్వహణలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పదిహేడు విషయ సూచికల ప్రకారం సమాచారాన్ని సేకరించి ఈ పుస్తకంలో నమోదు చేయాలని తెలిపారు. ప్రజారోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు గ్రామాల్లోని ఆరోగ్య కార్యకర్తలకు, వైద్యులకు తెలియపర్చాలని సూచనలిచ్చారు. పీవో డీటీటీ డా.వీణ, పీవో ఎన్‌సీడీ డా.సుమన్‌కల్యాణ్, వైద్యాధికారులు ప్రతాప్, సంపత్‌కుమార్, సీహెచ్ కాటంరాజు, ఆరోగ్య విస్తరణాధికారులు ఇస్తారి, సత్యనారాయణ, డీపీహెచ్‌ఎన్ సత్యవతి, ఎంపీహెచ్‌ఎస్ ఝాన్సీలక్ష్మి, వేణుగోపాల్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


తంగడపల్లిలో ఆశ కార్యకర్తల దినచర్యల నమోదు పుస్తకాలను విడుదల చేస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఎల్.యశోద

సాహస శిబిరానికి ఎంపిక

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కె.స్రవంతి జాతీయ సాహస శిబిరం-2024కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నిరూప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ తరపున కంటింజెంట్ లీడర్‌గా ఎంపికైనట్లు తెలిపారు. బీఏ తృతీయ సంవత్సర విద్యార్థి ప్రతిభ కూడా ఈ సాహస శిక్షణకు ఎంపికైనట్లు వెల్లడించారు. ప్రోగ్రాం అధికారి కె.స్రవంతి, వాలంటీర్ ప్రతిభను ప్రిన్సిపల్ అభినందించారు.


అధికారి కె.స్రవంతి, వాలంటీర్ ప్రతిభతో ప్రిన్సిపల్ నిరూప

క్రమశిక్షణకు మారుపేరు ఆర్‌ఎస్‌ఎస్

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: దేశభక్తులను తయారు చేస్తూ క్రమశిక్షణకు ఆర్‌ఎస్‌ఎస్ మారుపేరుగా నిలుస్తోందని బీబీనగర్ ఎయిమ్స్ ఫోరెన్సిక్ మెడిసిన్, టాక్సికాలజీ హెచ్‌వోడీ డాక్టర్ ప్రజ్ఞేష్ పర్మర్ అన్నారు. పట్టణ కేంద్రంలో విజయదశమి ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పోచంపల్లి ఖండ ఆధ్వర్యంలో పదసంచలన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా వచ్చిన శ్రీధర్ మాట్లాడుతూ.. హిందువులపై, హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని వాటిని ఎదుర్కొవాలంటే హిందూ సంఘటన్ జరగాలని శక్తి ప్రదర్శన చూపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రకాష్, నరహరి, పాండు, అరవింద్, సంతోష్, భిక్షపతి పాల్గొన్నారు.


భూదాన్‌పోచంపల్లిలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రదర్శన

బునాదిగాని కాల్వకు మోక్షం

◆ రూ.267 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు


అసంపూర్తిగా బునాదిగాని కాలువ పనులు

భువనగిరి, న్యూస్‌టుడే: బునాదిగాని కాలువ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.267 కోట్లు మంజూరు చేస్తూ జీవో 271 జారీ చేసింది. ఇక సాంకేతిక అనుమతులు, టెండర్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంది.

17 ఏళ్లుగా పనులు.. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మక్తా అనంతారం ఫీడర్ ఛానల్ నుంచి మోత్కూరు మండలం ధర్మాచెరువు వరకు రూ.146 కోట్లతో 98.64 కి.మీ కాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. నీటి లభ్యత లేకపోవడం, సాంకేతిక లోపాలు, గుత్తేదారుల నిర్లక్ష్యం, భూసేకరణలో అవాంతరాలతో పనులు ముందుకు సాగలేదు. సొంత రాష్ట్రం ఏర్పాటయ్యాక పనులు పూర్తవుతాయని ఆశించినా నిరాశే ఎదురైంది.

★ బునాదిగాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పనులు ఒక ప్యాకేజీ కింద ఏర్పాటు చేసి వీటి డిజైన్లు మార్చి పనుల పునరుద్ధరణకు రూ.284 కోట్లు మంజూరు చేస్తున్నట్లు 2016లో చౌటుప్పల్ సభలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. కొంత వరకు పనులు పూర్తయినా చివరి వరకు నీరందలేదు. బునాదిగాని కాలువ ద్వారా మూసీ నీరు కేవలం బునాదిగాని చెరువు వద్దకు మాత్రమే వచ్చింది. మూసీ ఈ కాలువ పనులు ప్రారంభించి 17 ఏళ్లు అవుతున్నా 98 కిమీ కాలువను గత పాలకులు పూర్తి చేయకపోవడం గమనార్హం.

స్వరూపం ఇలా :

కాలువ ప్రారంభం : మూసీపై బీబీనగర్ మండలం మక్తా అనంతారం ఫీడర్ చానల్ వద్ద ప్రారంభం			ముగింపు: మోత్కూరు మండలం ధర్మారం ఊర చెరువు వరకు
కాలువ పొడవు: 98.64 కి.మీ.	నీటి ప్రవాహం: 355 క్యూసెక్కులు	వెడల్పు: 6 మీటర్లు	స్ట్రక్చర్లు : 255, 30 పూర్తయ్యాయి. 225 పనులు చేపట్టాలి
కాలువ ద్వారా నిండే చెరువులు: 50	లబ్ధిపొందే మండలాలు: బీబీనగర్, భువనగిరి, వలిగొండ, మోటకొండూరు, ఆత్మకూర్(ఎం), మోత్కూరు, అడ్డగుడూరు,		నియోజకవర్గాల వారీగా ఆయకట్టు: భువనగిరి- 6,155, ఆలేరు-1930, తుంగతుర్తి-12,490 ఎకరాలు
గ్రామాలు : 37	ఆయకట్టు: 20,575 ఎకరాలు, కొత్తది: 14,575 ఎకరాలు, స్థిరీకరణ అయ్యేది: 6వేల ఎకరాలు		

ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు : రూ.267 కోట్లు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కదలిక...

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బునాదిగాని కాలువ అంశం మళ్లీ తెర మీదకు వచ్చింది. ఎట్టిపరిస్థితుల్లో పూర్తి చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా సుముఖత వ్యక్తం చేసి నిధులు మంజూరు చేస్తామని భువనగిరిలో జరిగిన సభలో ప్రకటించారు.

★ కాలువ వెడల్పు, లోతు పెంచనున్నారు. గతంలో 55 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండేలా కాలువను డిజైన్ చేయగా.. ఇప్పుడు 355 క్యూసెక్కుల నీరు ప్రహించేలా వెడల్పు చేస్తారు. 255 స్ట్రక్చర్స్ నిర్మిస్తారు. మంజూరు చేసిన మొత్తంలో రూ.190 కోట్లు పనులకు, రూ.40 కోట్లు భూసేకరణకు కేటాయించారు. జీఎస్టీ ఇతర ఖర్చులకు మిగలిన మొత్తాన్ని కేటాయించినట్లు తెలిసింది. ఇక సాంకేతిక అనుమతులకు ప్రతిపాదనలు చేపడతారు. ఈఎన్‌సీ నుంచి సాంకేతిక అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ చేపడుతారు.

మోడువారినా.. ఇటు చూడరే!



భువనగిరి పట్టణ శివారులోని జగదేవ్‌పూర్ ఫ్లైఓవర్‌పై సుమారు మూడేళ్ల క్రితం అప్పటి సీఎం కేసీఆర్ రాక పురస్కరించుకుని పూల కుండీలు రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేశారు. కొన్నాళ్లు వీటి నిర్వహణ బాగానే ఉన్నా ఇటీవల గాలికి వదిలారు. మొక్కలు ఎండిపోయి మోడుబారాయి. పరిశీలించి నిర్వహణ చేపడుతామని మున్సిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు వివరణ ఇచ్చారు.

-న్యూస్‌టుడే, యాదాద్రి, భువనగిరి

మండల వాసులకు ఉచిత దర్శనం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో ప్రధాన దేవాలయంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దర్శనానికి స్థానికులతో పాటు గుట్ట మండలంలోని భక్తులకు ఉచిత ప్రవేశ కల్పిస్తూ ఈ ఆలయ ఈవో భాస్కర్‌రావు శనివారం ప్రకటన జారీ చేశారు. వారంలో మంగళవారం ఉదయం 8:15 నుంచి 9 గంటల వరకు, శనివారం ఉ.7గంటల నుంచి 9 వరకు ఉచిత దర్శనం కల్పిస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. మంగళవారం ఆధార్ కార్డుతో పాటు సంప్రదాయ దుస్తులు ధరించి వచ్చిన స్థానిక పట్టణ, మండల వాసులకు గర్భాలయ ప్రవేశం ఉంటుందని తెలిపారు. శనివారం మాత్రం గర్భాలయ మహాద్వారం స్వర్ణ గడప వద్ద నుంచే దైవ దర్శనం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆధార్‌కార్డు చూపిస్తేనే సదరు అవకాశం కలుగుతుందన్నారు.

జాలువారుతున్న జలం.. హృదయాలు పులకించే తరుణం



నల్లమల అటవీప్రాంతాల్లో జాలువారుతున్న జలపాతాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. దేవరచర్ల గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పురాతన శివాలయం వద్ద, రేకులగడ్డ, చిత్రియాల గ్రామాల సమీపంలోని మామిడిగుండాల జలపాతంతోపాటు పొగిళ్ల గ్రామ సమీపంలోని గవ్వలసరి జలపాతాలు వరుసగా కురుస్తున్న వానలకు జాలువారుతూ సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. ఆయా ప్రదేశాల్లో అడవి జంతువులు సంచరిస్తున్నాయన్న హెచ్చరికలు ఉన్నప్పటికీ పర్యాటకులు ఈ జలసవ్వడులను చూసేందుకు బారులు తీరుతున్నారు. దేవరచర్ల నల్లమల అటవీ ప్రాంతంలో కనువిందు చేస్తున్న జలపాత దృశ్యమిది.

– న్యూస్‌టుడే, చందంపేట

నీడనిచ్చే షెడ్.. విరాళాల విభాగం ఏర్పాటు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులలో నడవలేని వారితో పాటు వృద్ధులు, చంటి పిల్లల తల్లులు ప్రధానాలయానికి చేర్చే బ్యాటరీ వాహనాల కోసం వేచి ఉండేందుకు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రత్యేక షెడ్‌ను నిర్మించింది. వీవీఐపీల వాహనాల పార్కింగ్ ప్రాంగణంలోని బ్యాటరీ వాహనాల స్టాండ్ వద్ద నీడనిచ్చే షెడ్‌తో పాటు కూర్చునేందుకు బెంచీలు ఏర్పరిచారు. బస్‌స్టాండ్, కార్ పార్కింగ్ నుంచి వృద్ధులు, గర్భిణులు, బాలింతలు నడుస్తూ ఆలయానికి చేరడం కష్టమే. వారి కోసం దాతల సహకారంతో బ్యాటరీ వాహనాలు కల్పించిన దేవస్థానం ఇతర వసతులు కల్పిస్తోంది.



విరాళాల సేకరణ కోసం ఏర్పాటైన విభాగం

★ ఆలయ కైంకర్యాలు, అన్నప్రసాదం, గదుల నిర్మాణానికి దాతలు సమర్పించే విరాళాల సేకరణకు ప్రధానాలయ మాడవీధిలో ప్రత్యేక విభాగం నిర్మించారు. ఆలయానికి అనుగుణంగా ఫైబర్ షీట్ల ద్వారా దేవుడి బ్రహ్మోత్సవ రథశాల పక్కనే సదరు విభాగం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.


చికెన్ ధరలు


ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

డ్యాంను పరిశీలించిన సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ సీఈ

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ డ్యాంను సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ సీఈ నిత్యానంద ముఖర్జీ శనివారం సందర్శించారు. ఆయన ఈ సందర్శనలో భాగంగా హాలియా ప్రాంతంలోని ఎడమ కాల్వపై, సాగర్ డ్యాం దగ్గర ఉన్న నీటి విడుదలకు సంబంధించిన టెలిమెంటరీ సిస్టమ్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఎన్నెస్పీ ఈఈ మల్లికార్జునరావు, ఏఈ కృష్ణయ్య, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నడత నేర్పిన తరం.. తరలిపోతోంది..!





న్యూస్‌టుడే, నాంపల్లి

పాల నురగకు తీసిపోని దవళ వర్ణపు వస్త్రధారణ.. రాజసాన్ని చూపే పంచెకట్టు.. హుందాతనానికి గుర్తుగా తాత మీసం కట్టు.. ఆత్మ గౌరవాన్ని కళ్లకద్దే బామ్మ బొట్టు.. శ్రమైక జీవన యానంతో అధిరోహించిన వయసు మెట్టు.. పనస సౌరభం లాంటి స్వేద సుగంధంతో తనువు చాలించే వరకూ తప్పని నీతి ఒట్టు.. స్వచ్ఛమైన మనసు.. మధురమైన పలకరింపుతో మన కలలను నిజం చేసిన పెద్దల తరం వెళ్లిపోతోంది. జీవన కడలిలో కష్టాల సుడిగుండాలు చుట్టిముట్టినా తొణకని గంభీర స్వరం మూగబోతోంది. ధర్మనిష్ఠ పాటిస్తూ కుటుంబాలకు నాగరికత నేర్పిన నాటి తరం.. తరతరాలకు తీపి సూక్తులుగా మిగిలిపోనున్నారు. తాత, అమ్మమ్మ, నానమ్మ ఇలా.. కాలక్రమేణా ఒక నాటి పెద్దల తరం వయోభారంతో కనుమరుగవుతోంది.

దీపాల వెలుగుల్లో దేదీప్య జీవనం..

పూటగడవని ఆ రోజుల్లో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా పస్తులైనా భరించే వారు తప్ప ఇంటి గుట్టు బయటపడనిచ్చే వారు కాదు. 'కాకి పిల్ల కాకికి ముద్దు' సామెత చందంగా చిరిగిన బట్టలు కుట్టుకొని ధరించే ఇంటి పెద్ద తమ సంతానానికి ఆ లోటు రాకుండా చూసేవారు. పచ్చడి మెతుకులే పరమాన్నంగా కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు. తాము పడే 'ఈతి' బాధలు పక్కింటి వారితో కూడా చర్చించే వారు కాదు. రోజువారి పనికి సమయంతో పనిలేదనే భావన వారికుండేది. వ్యవసాయానికి యంత్రాలు లేని నాటి కాలంలో.. తెల్లవారకముందే సాగు పనుల్లో నిమగ్నమై దీపాలు పెట్టే వేళకు ఇల్లు చేరేవారు. పగలంతా పడిన కష్టాన్ని మరిచి మిణుకు మంటూ వెలిగే నూనె దీపాల వెలుగులో ఇంటిల్లిపాది కూర్చొని కాచిన గంజో.. మెతుకులో కలిసి తినడం వారికి సంతృప్తినిచ్చేది. నాగరికత నడక నేర్చుకునే రోజుల్లోనే కుటుంబాల కోసం సర్వం ధారబోసిన ఆ పెద్దాయన నేడు క్రమంగా కనుమరుగవుతున్నారు.

పెద్దల మాట పరమాన్నం మూట..

'పెద్దల మాట చద్దన్నం మూట' సామెత అందరికీ తెలిసిందే. ఆ రోజుల్లో అత్యధికంగా ఉమ్మడి కుటుంబాలే ఉండేవి. ఒక్కో ఇంట్లో పగలూ రాత్రి కలిసి 20 కిలోల వరకు ఆహార ధాన్యాలు వండి వార్చే వారంటే అతిశయోక్తి కాదు. ఒక కుటుంబంలో 10 నుంచి 20 మంది వరకు కుటుంబ సభ్యులున్నా భేషజాలు ఉండేవి కావు. అంతమందిలోనూ నీతి నియమాలే కట్టుబాట్లుగా కుటుంబ పెద్ద చెప్పిందే వేదం. తమ కుటుంబంలోని పిల్లలకు పెళ్లి సంబంధాలు చూడాలన్నా.. పెళ్లిల్లు చేయాలన్నా ఉమ్మడిగానే నిర్ణయాలు తీసుకునేవారు. ఇక శుభకార్యాలకు ఏ ఒక్క బంధువునీ మర్చిపోకుండా ఆహ్వానించి వారం రోజులు వెళ్లనిచ్చేవారు కాదు. ఇలా రోజంతా వరసైన బంధుత్వపు పిలుపులతో పల్లె లోగిళ్లు కళకళలాడేవి. ఈ మమకారానికి కారణం ఆ పెద్దాయనే సుమా..! ఆకలి చంపుకొని కుటుంబం కోసం పరితపించిన పెద్దాయన, పెద్దావిడను కడుపున పుట్టిన బిడ్డలు చేరదీయకపోవడంతో ఇప్పటికీ కొన్నిచోట్ల అనాధాశ్రమాల్లో కాలం వెళ్లదీస్తున్నారు.

☛ ఇది మన సంస్కృతి కాదు కదా. తమకంటూ ఏమీ దాచుకోకుండా.. సమాజానికి నడ(క)వడి నేర్పిన పెద్దలు వయోభారంతో మనల్ని వదిలి వెళ్తుంటే.. కంట నీరు ఆగనంటోంది.. మనసు మౌనంగా రోదిస్తోంది. మరుజన్మ ఉందో లేదో తెలీదు కాబట్టి మనకు జన్మనిచ్చిన వారిని, నడత నేర్పిన పెద్దలనూ ఈ జన్మలోనే గౌరవిద్దాం. వారిని కడవరకూ కుటుంబాలతోనే కలిసి ఉండేలా చూద్దాం. వారి ఆశలు.. ఆశయాలు.. ఆకాంక్షలు నెరవేర్చడం బాధ్యతగా తీసుకుందాం.

తమకంటూ ఏమీ దాచుకోలేదు..

ప్రస్తుతం పల్లెల్లో డాబా ఇళ్లు.. అంతస్తులు వెలుస్తున్నాయి. గతంలో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే కార్మికులకంటే ఇంటి యజమాని ఎక్కువ కష్టించేవారు. మట్టి, కలప ఎడ్ల బండితో ముందస్తుగా చేరవేసేవారు. తానూ ఓ కార్మికుడై ఇంటి నిర్మాణంలో పాలుపంచుకునేవారు. తాము కట్టుకున్న అరుదైన గూటిలో పిల్లాపాపలతో ఆనందంగా గడిపేవారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా తాము నమ్ముకున్న భూమి, కట్టుకున్న ఇల్లు మాత్రం అమ్మకానికి పెట్టేవారు కాదు. తల్లిదండ్రులను ఎంత ఆప్యాయంగా చూసుకునేవారో పంట క్షేత్రాన్ని, పాడి సంపదనూ అంతే ప్రేమగా ఆరాధించేవారు. తమ బిడ్డలు నిరాశ్రయులు కావొద్దనే ఆకాంక్షతో తమ కాంక్షలెన్నో చంపుకొన్నారు. తాము సంపాదించిన ఆస్తిలో ఇసుమంతైనా అమ్ముకోకుండా కుటుంబ శ్రేయస్సు కోసం శ్రమించిన పెద్దలు వెళ్లిపోతున్నారు.

ఆ రోజుల్లో ఎనలేని గౌరవం



అంబళ్ల చెన్నయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు, నాంపల్లి

పూర్వం సమాజంలో పెద్దల మాటకు ఎనలేని గౌరవం ఉండేది. ఏ పని చేయాలన్నా వారి సలహాలు, సూచనలు పాటించే వారు. ఆ కారణంతోనే అప్పట్లో కుటుంబ బంధాలు, మానవ సంబంధాలు పటిష్ఠంగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. మన నడవడి మన పిల్లలకు భవిష్యత్తు పాఠం నేర్పుతుందనే విషయం విస్మరించొద్దు. నేటి తరం వారు పెద్దల సూచనలు పాటించి, వారి పట్ల ప్రేమ చూపిస్తే రేపటితరం కూడా అదే నేర్చుకుంటారు. పెద్దలు ఆత్మీయత పంచే అక్షయ పాత్ర లాంటి వారు. వారిని గౌరవించడం అందరి బాధ్యత.

జన్మాంతం కుటుంబశ్రేయస్సుకే...



వీరమళ్ల లక్ష్మమ్మ, నాంపల్లి

జీవితమంతా కుటుంబ శ్రేయస్సు కోసం ధారపోసిన పెద్దలు వృద్ధాప్యంలో కోరుకునేది ఆత్మసంతృప్తి. అదెక్కడ దొరుకుతుంది.. కన్న బిడ్డలు ప్రయోజకులుగా మారి కళ్లెదుట ఉన్నప్పుడు.. ప్రేమ, ఆప్యాయత చూపినప్పుడు. ప్రస్తుతం ఉపాధి కోసం, ఉరుకుల పరుగుల జీవితంలో అన్ని కుటుంబాల్లో అది సాధ్యం కావడం లేదు. ఉన్న సమయంలోనే కొంత ముదిమిలో ఉన్న కన్నవారి కోసం కేటాయిస్తే వారికి కనుల సంబరంగా ఉంటుంది. అంతకు మించి వారు ఆశించేది కూడా ఏమీ ఉండదు.

నేడు ఖోఖో ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా జూనియర్ ఖోఖో బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలను గుర్రంపోడు మండలం కొప్పోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి నాతి కృష్ణమూర్తి తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 18 ఏళ్లలోపు వయసు ఉండి, నవంబరు 22, 2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని సూచించారు. వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డులతో ఆదివారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన వారు అక్టోబరు 28, 29, 30 తేదీల్లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

రూ.పది నాణెం చెల్లుతుంది

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే:

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ఉమ్మడి నల్గొండ జిల్లాలో పది రూపాయల నాణేలు తీసుకోవడం లేదనే ఫిర్యాదులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ప్రయాణికులు ఇచ్చే రూ.10 నాణేలను తీసుకోవాలని ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లను ఆ సంస్థ యాజమాన్యం ఆదేశించింది. ఫిర్యాదు నేపథ్యంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కార్యదర్శి గత నెల 29న ఆయా డిపో మేనేజర్లకు ఆదేశాలు సైతం జారీ చేశారు. ఇంత ప్రచారం చేపడుతున్నా.. అవగాహన రాహిత్యంతో కొంత మంది ప్రజలు కూడా పది రూపాయల నాణేలు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు.



రాజపేట బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన గోడపత్రిక

అసలెందుకీ పరిస్థితి..

పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్న తర్వాత రూ.1000, రూ.500 రద్దు చేసి వాటి స్థానంలో కొత్త రూ.2వేలు, రూ.500 విడుదల చేశారు. పెద్ద నోట్ల రద్దు అనంతరం ఎక్కువ మొత్తంలో చిల్లర సమస్య ఉత్పన్నమైంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు పది రూపాయల నాణేన్ని చెలామణిలోకి తీసుకొచ్చారు. బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించినప్పుడు ఎక్కువ మొత్తంలో నాణేలను ఖాతాదారులకు ఇచ్చారు. ఈ బరువు మాకెందుకని చాలా మంది బయట ఎవరూ తీసుకోవడం లేదనే వదంతులకు తెరలేపారని కొందరి వాదన. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.కోట్ల విలువైన రూ.10 నాణేలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ప్రధానంగా బ్యాంకు సేవలకు వచ్చేవారికి కనిపించే విధంగా బ్యాంకు కార్యాలయం ప్రాంగణంలో పదిరూపాయల నాణేల చెల్లింపుల పోస్టర్లను, ఫ్లెక్సీలను బ్యాంకు అధికారులు ప్రదర్శిస్తుండటం విశేషం.

అవగాహన కల్పిస్తున్నాం..

– తిరుమలశెట్టి నాగలక్ష్మి, మేనేజరు, గ్రామీణ వికాసబ్యాంకు, రాజపేట

పది రూపాయల నాణేలు చెలామణి విషయమై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఎవరైనా వాటిని తీసుకోవడానికి నిరాకరిస్తే చట్టపరంగా చర్యలుంటాయనే విషయాన్ని సైతం వివరిస్తున్నాం. అపోహలను నమ్మకుండా నిరభ్యరంతరంగా పది రూపాయల నాణేలను తీసుకోవచ్చు. తిరిగి చెల్లించవచ్చు.

18 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతం నుంచి సాగర్‌కు వరద నీటిరాక కొనసాగుతుండగా ఎన్నెస్పీ అధికారులు 18 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. శనివారం రాత్రి 9 గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 1,90,198 క్యూసెక్కుల వరద వస్తుండగా ఎన్నెస్పీ అధికారులు డ్యాం 26 గేట్లలో 18 గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 1,45,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గేట్లతో పాటు కుడికాల్వ ద్వారా 6,112 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,173 క్యూసెక్కులు, ప్రధాన విద్యుత్కేంద్రం ద్వారా 29,313 క్యూసెక్కులు, ఎస్ఎల్బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 400 క్యూసెక్కులు మొత్తం 1,90,198 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 590.00 అడుగుల వద్ద ఉంది.


విడుదలవుతున్న నీరు

నూతన వీసీగా బాధ్యతల స్వీకరణ


వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొ.అల్తాఫ్ హుస్సేన్

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నూతన వీసీగా ప్రొ.అల్తాఫ్ హుస్సేన్ శనివారం వర్సిటీలోని ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వీసీగా పనిచేసిన అనుభవంతో వర్సిటీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతో పాటుగా వారి విద్యాభివృద్ధికి సహకరించనున్నట్లు తెలిపారు. యూనివర్సిటీతో పాటు పరిధిలోని అన్ని కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ప్రణాళికలను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో పరిశోధన పరిజ్ఞానం పెంపొందించేలా సెమినార్లు నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం వర్సిటీలోని పలు విభాగాలను పరిశీలించి అధ్యాపకులు, సిబ్బందితో ముచ్చటించారు. నూతన వీసీకి ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్డీ టూ వీసీ ప్రొ.అంజిరెడ్డి, వై.ప్రశాంతి, ఉపేందర్‌రెడ్డి, మద్దిలేటి, వెంకటరమణారెడ్డి, అరుణప్రియ, రాంరెడ్డి, ప్రేమ్‌సాగర్, అధ్యాపకులు అభినందించారు.

శ్రీహరి కోటకు..తేజ విద్యార్థి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ, భారత కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో.. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా విద్యార్థులకు 'జాతీయ అంతరిక్ష దినోత్సవ క్విజ్-2024' పోటీలు నిర్వహించారని, అందులో ప్రతిభ చూపిన కోదాడకు చెందిన విద్యార్థి గుజ్జుల హర్షవర్ధన్ రెడ్డి ఎంపికైనట్లు తేజ విద్యాలయ ప్రిన్సిపల్ రమా తెలిపారు. దేశవ్యాప్తంగా ఆగస్టు 10 నుంచి సెప్టెంబరు 30 వరకు ఈ పోటీలను నిర్వహించగా.. 3,66,308 మంది పాల్గొన్నారని, అందులో 100 మందిని ఎంపిక చేశారన్నారు. తేజ పాఠశాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొనగా 7వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్‌రెడ్డి ఎంపికయ్యాడని తెలిపారు. ఎంపికైన వారిని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)వారు అంతరిక్ష రాకెట్ ప్రయోగ కేంద్రం శ్రీహరి కోటను సందర్శించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. హర్షవర్ధన్‌రెడ్డిని డైరెక్టర్ సోమిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.


హర్షవర్ధన్‌రెడ్డిని అభినందిస్తున్న తేజ విద్యాలయ ప్రిన్సిపల్ రమా

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రామన్నపేట, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఎన్నారం, పల్లివాడ, కుంకుడుపాముల, నిధానపల్లి, ఇంద్రపాలనగరం, రామన్నపేట, వెల్లంకి తదితర గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని తెలిపారు. అన్నదాతలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నంద్యాల భిక్షంరెడ్డి, రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, జ్యోతి, బాలకిషన్ పాల్గొన్నారు.



పల్లివాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

పది కాళ్లతో గొర్రెపిల్ల జననం



అడ్డగూడూరు, న్యూస్‌టుడే: మండలంలోని డి.రేపాక గ్రామంలో కాపరి ముక్కెర్ల యాదమల్లుకు చెందిన గొర్రె శనివారం పది కాళ్లతో వింత ఆకారం ఉన్న పిల్లకు జన్మనిచ్చింది. పుట్టిన కాసేపటికే గొర్రె పిల్ల చనిపోయింది. జన్యులోపంతో గొర్రె పిల్లలు అరుదుగా ఎక్కువ కాళ్లతో జన్మిస్తాయని పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి తెలిపారు.

చేనేతకు చేయూత

ప్రతి శనివారం చేనేత వస్త్రాలను ధరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సిబ్బంది



చేనేత వస్త్రాలను ధరించిన బ్యాంక్ సిబ్బంది

చేనేత కళాకారులకు తమ వంతు సహకారంగా ఉండాలనే సదుద్దేశంతో చేనేత వస్త్రాలను ధరిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు పట్టణ కేంద్రంలోని పోచంపల్లి అర్బన్ బ్యాంక్ సిబ్బంది. బ్యాంక్‌కు వచ్చే ఖాతాదారులకు చేనేత వస్త్రధారణ చూసి ఆకర్షితులయ్యేందుకు ప్రతి శనివారం సిబ్బంది చేనేత వస్త్రాలను ధరించాలనే నిబంధన పెట్టారు. ఇందు కోసం బ్యాంక్ ఛైర్మన్ తడ్క రమేష్ బ్యాంక్‌లోని 30 మందికి సిబ్బందికి అవసరమైన చేనేత వస్త్రాన్ని ఉచితంగా అందించారు. ప్రతి శనివారం చేనేత వస్త్రాలను ధరించడంతో పాటు వచ్చే వారికి చేనేత వస్త్రాలు ధరించేలా ఆలోచన వచ్చేలా చేయడంపై చేనేత కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే:

చేనేత వస్త్రాలను ధరించాలని..

– రచ్చ శ్రీనివాస్, మేనేజర్ పోచంపల్లి అర్బన్ బ్యాంక్



చేనేత వస్త్రాలను ధరించడం వల్ల శరీరానికి ఎంతో మేలుజరుగుతుంది. మావంతు బాధ్యతగా చేనేత వస్త్రాలను ధరించడమే కాకుండా ప్రచారం కూడా నిర్వహిస్తున్నామనే తృప్తి కలుగుతుంది.

తమవంతు సహకారంగా..


– బి. స్రవంతి, ఉద్యోగిని



చేనేత కళ అంతరించిపోకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలి. కనీసం వారంలో ఒక్కరోజైన వినియోగిస్తే బాగుంటుంది. తద్వారా చేనేత వస్త్ర కొనుగోళ్లు జరగడంతో కార్మికులకు ఉపాధి కల్పించిన వారమవుతాం.

పని కల్పించాలనే ఉద్దేశంతో..

– తడ్క రమేష్, ఛైర్మన్ పోచంపల్లి అర్బన్ బ్యాంకు, భూదాన్‌పోచంపల్లి



చేనేత వస్త్రాలను ప్రతిఒక్కరూ ధరించి చేనేత కార్మికులకు చేతినిండా పనికల్పించాలనే సంకల్పం. అందు కోసం బ్యాంకు సిబ్బంది ప్రతి శనివారం చేనేత వస్త్రాలు ధరించాలనే నిబంధన పెట్టాం. అవసరమైన చేనేత వస్త్రాన్ని సిబ్బందికి ఉచితంగా అందించాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80082 78928 80085 74375

గుండాల, న్యూస్‌టుడే:

? గుండాల ప్రధాన రహదారి వెంట ఉన్న సైడ్ డ్రైన్‌లో కొన్ని నెలలుగా నిలవనీరు ఉండటంతో దోమలు, మురుగు వాసనతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

✔ పంచాయతీ సిబ్బంది చెప్పి నీరు తొలగిస్తాం. – వి.విజయ, కార్యదర్శి,

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే:

? అనాజిపురం, నందనంతో పాటు పలు చెరువులకు మూసీనీరు ప్రవహించడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. – మొలుగు లక్ష్మయ్య, నందనం

✔ ఈ విషయమై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.. – భరత్, ఐబీ ఏఈఈ

మూసీ పునరుజ్జీవంతో అందరికీ ప్రయోజనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: మూసీ పునరుజ్జీవనంతో ఉమ్మడి నల్గొండ జిల్లాకు భారీ ప్రయోజనం చేకూరనుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. మూసీ పునరుజ్జీవనంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారంపై ప్రజలను చైతన్య పర్చేందుకు ఉమ్మడి నల్గొండ మూసీ నది పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. సమావేశంలో పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, నాయకులు కూర వెంకటేష్, బర్రె జహంగీర్, బీసుకుంట్ల సత్యనారాయణ, బెండె లాల్‌రాజ్, బెండె శ్రీకాంత్, ఆవేస్ చిస్తీ, మజ్‌హర్, బాష బోయిన రాజేష్, జలీల్ పాల్గొన్నారు.

మూడు నెలల్లో పూర్తి చేస్తాం..భువనగిరి పట్టణం: సమీకృత మార్కెట్ సముదాయంలో అసంపూర్తిగా మిగిలిన పనులను రూ.కోటి వ్యయంతో మూడు నెలల వ్యవధిలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సమీకృత మార్కెట్ సముదాయాన్ని శనివారం పరిశీలించారు.

భువనగిరి గ్రామీణం : ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బొల్లేపల్లి, అనాజిపురం, ఆకుతోట బావితండా, సూరేపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీఎం సునిల్, నాయకులు గడ్డమీది వీరస్వామి, కానుకుంట్ల బాబురావు, కొండల్, బాలకృష్ణ, రావి వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా..అభివృద్ధి జాడేది..?: సునీత



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీత

ఆలేరు, న్యూస్‌టుడే: అధికార కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో ఆలేరు పురపాలికలో అభివృద్ధి పనులు అటకెక్కాయని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. ఆలేరులో శనివారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆలేరు పురపాలికకు స్పెషల్ ఫండ్స్ కింద టీయూఎఫ్ఐడీ ద్వారా రూ.15 కోట్లు మంజూరు కాగా, ఇందులో పురపాలిక భవన నిర్మాణానికి రూ.3 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. నిర్మాణ పనులు మాత్రం నేటికీ మొదలు పెట్టలేదన్నారు. ఆలేరు అభివృద్ధికి అధిక నిధులు తీసుకువస్తున్నామని ప్రకటిస్తున్న కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు నిధులు ఉన్నప్పటికీ పురపాలిక భవన నిర్మాణ పనులను ఎందుకు చేపట్టడం లేదో ప్రజలకు చెప్పాలన్నారు. పుర ఛైర్మన్ వస్పరి శంకరయ్య, భారాస పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం, మాజీ వైస్ ఎంపీపీ కోరుకొప్పుల కిష్టయ్య, మొరిగాడి వెంకటేశ్, కుండె సంపత్, పత్తి వెంకటేశ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కాలం చెల్లిన మందులు.. సరఫరా.. సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో కాలం చెల్లిన మాత్రలు సరఫరా చేయడంతో రోగులు పరేషాన్ అయ్యారు. ఓ ఆశా కార్యకర్త మందు బిళ్లలు పంపిణీ చేస్తున్న క్రమంలో ఓ రోగికి కాలం చెల్లిన టీబీ మాత్రలు నెలకు సరిపడా ఇచ్చారు. ఇంటికి వెళ్లి మాత్ర వేసుకుందామనే క్రమంలో గమనించి ఇవి ఎలా ఇస్తారని చరవాణిలో ఆశా కార్యకర్తను నిలదీశాడు. గతంలోనూ ఇలాంటి మాత్రలు పంపిణీ చేశారని ఆ రోగి తెలిపాడు. ఈ విషయంపై స్థానిక పీహెచ్‌సీలో సంబంధిత ఉద్యోగిని న్యూస్‌టుడే సంప్రదించగా ఇటీవలే అలాంటి వాటిని తొలగించామని ఇలా జరగడంపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి.. ఆలేరు: యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆలేరు ఎస్సై పి.రజనీకర్ అన్నారు ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జిల్లా బాలల రక్షణ మరియు చైల్డ్ లైన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగం, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, నష్టాలపై నిర్వహించిన అవగాన సదస్సుకు హాజరై మాట్లాడారు. ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ పీవో జూకంటి వెంకటేశ్వర్లు, స్వప్న, నందిని, సురేష్, హరిబాబు పాల్గొన్నారు.

వీరోచిత పోరాట యోధుడు ధర్మబిక్షం.. సంస్థాన్ నారాయణపురం: సాయుధ, గీత పనివారల సంఘం వ్యవస్థాపనకు వీరోచితంగా పోరాడిన యోధుడు బొమ్మగాని ధర్మబిక్షం అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పందుల యాదగిరిగౌడ్ అన్నారు. సంఘం 67వ వార్షికోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ధర్మబిక్షం కాంస్య విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు గాలయ్య, సత్తయ్య, యాదయ్య, నర్సింహ, ముత్యాలు, బాల్‌రాజు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తాం.. భువనగిరి పట్టణం: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జైభీం ఆటో డ్రైవర్స్ వెల్ఫేర్ సొసైటీ వద్ద ఆయన పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, అసోసియేషన్ అధ్యక్షుడు గాయపాక పరమేశ్వర్, సభ్యులు వెంకటేష్, సంతోష్‌కుమార్, కిషన్, రమేష్, నాయకులు పోత్నక్ ప్రమోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మాయ దశరథ, కౌన్సిలర్ రత్నపురం బలరాం, నాయకులు సలావొద్దీన్, పాల్గొన్నారు.

వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి.. యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట ప్రధాన రహదారిలో పాత బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా, పాతగుట్ట చౌరస్తా, అండర్‌పాస్ మార్గం ఆయా చోట్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని సీపీఐ విజ్ఞప్తి చేసింది. శనివారం ఆ నాయకులు విలేకరులతో మాట్లాడారు. పాతగుట్ట చౌరస్తా వద్ద సర్కిల్ ఏర్పాటు చేస్తే భక్తులకు, స్థానికులకు ఇబ్బందులు కలగవని సూచించారు. రోడ్లు, భవనాల శాఖ ఈఈకి వినతిని అందజేశామని పేర్కొన్నారు. సమావేశంలో పేరబోయిన మహేందర్, బబ్బూరి శ్రీధర్, గోపగాని రాజు, మల్లయ్య, వెంకటేశ్, మధు పాల్గొన్నారు.

కంప్యూటర్ బహూకరణ.. అడ్డగూడూరు: తాను పని చేసిన పాఠశాలకు సాయం చేయాలనే సంకల్పంతో కంప్యూటర్, ప్రింటర్‌ను ఎంఈవో ఎన్.సబితకు శనివారం పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయిని టి.రేణుకారాణి బహూకరించారు. ఇటీవల కోటమర్తి ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఇక్కడే పదవీ విరమణ పొందిన ఆమె తనవంతు సాయంగా విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే కంప్యూటర్‌ను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రాజ్యవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌండ్ బాక్స్ అందజేత.. బొమ్మలరామారం , న్యూస్‌టుడే: బొమ్మలరామారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి వారిఆధ్వర్యంలో తిరునగరి రంగయ్య రూ.23 వేల విలువైన సౌండ్ బాక్స్, ఎంపల్ల బుచ్చిరెడ్డి రూ.4వేల విలువైన చెత్తబుట్టలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు జ్ఞానప్రకాష్ రెడ్డి, మల్లేశం, ఉపేందర్‌రావు, నర్సింహ పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయాలని వినతి.. మోత్కూరు: తమపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, అద్దె భవనాలను కిరాయి స్థిరీకరించాలని కోరుతూ శనివారం రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురుకుల పాఠశాలల అద్దె భవనాల సంఘ ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.సత్యం గౌడ్ తెలిపారు. కొంత మేర అద్దె బకాయిలు చెల్లించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరం.. బొమ్మలరామారం: భువనగిరి రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి, సుమంత్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బొమ్మలరామారం మండలంలోని సాయిధామ ఆశ్రమంలోని పాఠశాలలోని 75 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 10 మంది విద్యార్థులు కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ పిఠాధిపతి శ్రీరామానంద ప్రభూజీ, చంద్రారెడ్డి, జ్ఞానప్రకాష్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఉపేందర్‌రావు, రాజేష్ పాల్గొన్నారు .

పనులు ప్రారంభం.. బీబీనగర్: బీబీనగర్ మండలం రహీంఖాన్‌గూడ పద్మావతి అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శివాలయ పునర్‌నిర్మాణ పనులను శనివారం చేపట్టారు. తొలుత హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఛైర్మన్‌గా పంజాల విజయ్‌కుమార్‌గౌడ్‌ను మరోసారి ఎన్నుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత.. చేర్యాల(ధూల్మిట్ట): ధూల్మిట్ట మండల కేంద్రంలో 14.6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పట్టుకున్నట్లు మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. ధూల్మిట్టకు చెందిన పులి మల్లయ్య ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారంతో తనిఖీ చేసినట్లు చెప్పారు. యాదాద్రి జిల్లా పుట్టగూడానికి చెందిన మాలోతు నగేశ్ ఈ బియ్యాన్ని ఆ ఇంట్లో నిల్వ ఉంచినట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ముందున్న కారును ఢీకొట్టి.. కారు బోల్తా

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఎల్లంబావి వద్ద ఆర్గానిక్ హోటల్ సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు వెళ్తున్న కారు ముందున్న మరో కారును ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో బోల్తా పడిన కారులో ప్రయాణిస్తున్న లాగవత్ రామచంద్ నాయక్(58) గాయపడ్డాడు. ఈయన ఎర్రమంజిల్ పంచాయతీరాజ్‌శాఖలో చీఫ్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బోల్తా పడిన కారును హైవే నుంచి పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆలయంలో చోరీ

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తుర్కపల్లి మండలం వాసాలమర్రి శివారులోని పలుగుల మైసమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో చొరబడి హుండీని పగులకొట్టారు. అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం ఆలయానికి వెళ్లిన పూజారి దొంగతనం జరిగిన విషయాన్ని గమనించి గ్రామ పెద్దలకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ తక్యూద్దీన్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ మంచి నీటి సహాయకులు నాలుగురోజుల పాటు నేర్చుకున్న అంశాలు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని జడ్పీ సీఈవో శోభారాణి, మిషన్ భగీరథ సీఈ జి.లలిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ ముగింపు సందర్భంగా వారు మాట్లాడారు. నీటి నాణ్యతా ప్రమాణాలు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, నీటి పారుదల శాఖ డీఈఈ ప్రశాంత్, ఏఈఈ గుండూరావు, ఎంపీవో దినకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పొందిన మంచినీటి సహాయకులకు ధ్రువ పత్రాలను అందజేశారు.

ఠాణాను ఆశ్రయించిన ప్రేమజంట

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: ప్రేమ వివాహం ఇరువర్గాల మధ్య కొద్దిసేపు ఉద్రిక్తతకు దారితీసి, భరోసా కల్పించడంతో కథ సుఖాంతమైన ఘటన శనివారం యాదగిరిగుట్ట ఠాణా వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దాతారుపల్లికి చెందిన యువకుడు, భువనగిరి మండలం బస్వాపూర్‌కు చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకొని రక్షణ కోసం యాదగిరిగుట్ట ఠాణాను ఆశ్రయించారు. సమాచారంతో వారి కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు ఠాణాకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని, నచ్చజెప్పడంతో ఇరువర్గాలు శాంతించాయి. 10 గుంటల భూమిని అబ్బాయి, అమ్మాయి పేరుపై రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని డిమాండ్ తీసుకువచ్చారు. యువకుడి కుటుంబం ఒప్పుకోవడంతో కథ సుఖాంతమైంది.

మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రద్దు చేయొద్దు



మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న స్థానికులు

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ కోరారు. శనివారం ఆ సమితి ఆధ్వర్యంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కలిమెల నర్సయ్య, స్థిరాస్తి వ్యాపారుల సంఘం మండల అధ్యక్షుడు మహ్మద్ అలీ, వివిధ సంఘాల నాయకులు కారుపోతుల వెంకన్న, జంగ శ్రీనివాస్, సమీర్, సతీష్, శ్రీనివాస్, అహ్మద్, నగేష్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కుండపోత వర్షం



యాదగిరిగుట్టలో పడుతున్న వర్షం

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: యాదగిరిగుట్టలో శనివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండే ఎండతో ఉక్కపోత గురై ఇబ్బంది పడ్డ ప్రజలు, సాయంత్రం అనూహ్యంగా ఏకధాటిగా వర్షం పడటంతో ఉపశమనం పొందారు. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు కొంత కంగారు తెప్పించాయి. రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. చాలా సమయం వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



శ్రీసాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అంజేస్తున్న వైస్ ప్రిన్సిపల్ కౌసల్య



విజ్ఞాన్ కాన్సెప్ట్ స్కూల్‌లో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పోటీ పడి.. ప్రతిభ చాటి

భువనగిరి పట్టణంలోని శ్రీసాయి ప్రశాంతి విద్యానికేతన్, విజ్ఞాన్ కాన్సెప్ట్ పాఠశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. పోటీల్లో శ్రీసాయి ప్రశాంతి విద్యానికేతన్‌కు చెందిన టి.వైష్ణవి (పదో తరగతి) ప్రథమ, టి.శ్రీవిద్య (పదో తరగతి) ద్వితీయ, షబ్నమ్ నిఫుర్(పదో తరగతి) తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజ్ఞాన్ కాన్సెప్ట్ స్కూల్‌కు చెందిన సుమయ(ఎనిమిదో తరగతి) ప్రథమ, రచ్చ దివిజ(తొమ్మిదో తరగతి) ద్వితీయ, వలబోజు అన్విక(ఎనిమిదో తరగతి), తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు శ్రీసాయి ప్రశాంతి విద్యానికేతన్ వైస్ ప్రిన్సిపల్ కౌసల్య, విజ్ఞాన్ కాన్సెప్ట్ స్కూల్ ఛైర్మన్ పగిడాల జలేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ పగిడాల పురేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ మేడి స్వాతి బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

– భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే:



బహుమతులు, ధ్రువపత్రాలు అందజేస్తున్న పాఠశాల ఛైర్మన్ పగిడాల జలేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ పగిడాల పురేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ మేడి స్వాతి

సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేయొద్దని ర్యాలీ

రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేటలో సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేయొద్దని కోరుతూ విద్యార్థి సంఘాలు, పాఠశాలల యాజమాన్యాలు, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుభాష్ సెంటర్‌లో పర్యావరణ పరిరక్షణ కమిటీ మండల కన్వీనర్ జల్లెల పెంటయ్య మాట్లాడుతూ రామన్నపేటలో ఈనెల 23న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలందరూ పాల్గొని పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించాలన్నారు. ఎం.డి.రెహాన్, పోచబోయిన మల్లేశం, నర్సింహ, వెంకటేశం, జ్యోతి, ఫజల్‌బేగ్, రాజు, నరేందర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేయొద్దని కోరుతూ గౌడ్ సంఘం నాయకులు రెవిన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

జాతీయవాదులకు మద్దతుగా నిలవాలి

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భవిష్యత్తులో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు జాతీయవాదం కలిగిన అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని టీపీయూఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి కోరారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం వేర్వేరుగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు రేపాక ఉమారెడ్డి, సుకుమార్, రామకృష్ణారెడ్డి, మాధవరెడ్డి, పాల్గొన్నారు.

ఆలేరు : ఏపీటీఎస్, టీపీయూఎస్ రాష్ట్రాల పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి శనివారం ఆలేరు మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యయలను కలిసి మాట్లాడారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఓటరుగా నమోదు కావాలన్నారు.

గీతకార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కల్లు గీత కార్మికులు తాటి చెట్టు ఎక్కుతున్న సమయంలో ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచాల(కిట్లు)ను ఉచితంగా పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనాజిపురంలోని ఓ ఫంక్షన్ హాలులో శనివారం కిట్లు అందజేశారు. నాయకులు నానం కృష్ణ, బత్తిని లింగయ్య, దానయ్య, శ్యామ్‌గౌడ్, వీరస్వామి, మొలుగు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు అరికట్టాలి



భువనగిరి వినాయకచౌరస్తాలో ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

భువనగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దేవాలయాలపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర సహ కార్యదర్శి తోట భానుప్రసాద్ డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా పట్టణంలోని వినాయకచౌరస్తాలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బజరంగ్‌దళ్ ఉమ్మడి నల్గొండ జిల్లా కన్వీనర్ కోకల సందీప్ మాట్లాడుతూ.. భాగ్యనగరంలో ఉగ్రవాదులు తిష్ఠ వేస్తున్నా నిఘా వ్యవస్థ పట్టించుకోకపోవడం అత్యంత దారుణమన్నారు. రోడ్డుపై ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదానికి దిగారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కోశాధికారి చామ రవీందర్, సహాయకార్యదర్శి బురుగు సంతోష్‌రెడ్డి, చందా మహేందర్ గుప్తా , నాయకులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : దేవాలయాలను, దేవతా విగ్రహాలను ధ్వంసం చేస్తున్నవారిని, హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్న దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని విశ్వ హిందూపరిషత్ జిల్లా సహ కార్యదర్శి గరిశె శేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని తెలుపుతూ నిరసనగా భజరంగదళ్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు చౌటుప్పల్‌లో మోటార్‌సైకిళ్ల ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. భజరంగదళ్ జిల్లా కోకన్వీనర్ గోగు రవీందర్, మండల కన్వీనర్ ప్రేమ్‌కుమార్, కోకన్వీనర్ రోహిత్, భాజపా పుర, మండల కమిటీల అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేశ్, శివశంకర్, పవన్, సూరజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా అందించాలి

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: రైతు భరోసా అమలు చేయాలని, ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రతి గ్రామంలో ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎమ్డీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల ఎనిమిదో మహాసభ శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి వి.భిక్షం, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

బీబీనగర్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బీబీనగర్ మండలం వెంకిర్యాలలో గ్రామశాఖ 9వ మహాసభ సీనియర్ నాయకుడు సయ్యద్ ఉమర్ అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో వెంకిర్యాల శాఖ సీపీఎం కార్యదర్శిగా మాదారం శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయుడి మృతి



వలిగొండ, న్యూస్‌టుడే: వెలువర్తి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... నల్గొండ జిల్లా చిట్యాల మండలం పిటంపల్లి గ్రామానికి చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు, కవి, వ్యాస గేయ రచయిత **మండల స్వామి (52)** అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన గతంలో యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదేళ్లు విధులు నిర్వహించారు. ఇటీవల వలిగొండ మండలం వెలువర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడిగా బదిలీపై వచ్చారు. స్వామి కొన్నాళ్లుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.